# రంగులు

మధ్యాహ్నం నుంచి రాత్రి ఒంటి గంటవరకూ బిజీగా వుండే సినిమాహాలు రకరకాల రంగులలో కొత్తగా కట్టిన సినిమా హాలు. అందంగా వున్న సినిమా హాలు. అర్ధనగ్నంగా వాడిగా వేడిగా చూపుల్ని విసురుతూ వాల్ పోస్టర్ పై అందాల తార నడుం వంచి, చేతులుచాచి, ఆ ఒక్క యాంగిల్ కోసం సినిమా చూడ్డానికి ఎగబడే జనం.

ఆ సినిమాహాలుకి ముందు పాతబడిన పార్కు. చుట్టూ చిన్న కాంపౌండు. లోపల ఒక పనస చెట్టు, కొన్ని పూల మొక్కలు, సిమెంట్ బెంచీలు, ఒక మూల చిన్న గది. అందులో ప్రభుత్వం వారి రేడియో. పాటలు వినడానికి కొందరు, మనశ్శాంతి కోసం కొందరు, ఏమీ ఉబుసుపోక కొందరు_ప్రతిసాయంకాలం ఆ పార్కుకి.

సాయంకాలం కళకళలాడుతూ వుండే పార్కు_రాత్రి ఎనిమిది దాటే టప్పటికి బోసిగా వుండే పార్కు - హడావుడి కామక్రీడలకు వుపయోగపడే పార్కు - మరుగుదొడ్డిగా అవసరమయ్యే పార్కు.

ఆ పార్కుకు పక్కన చిన్నచెరువు-పసరు పట్టిన నీళ్లతో పశువులకు ఉపయోగపడుతూ చెరువు - ఆత్మహత్యలకు పనికొచ్చే చెరువు-డ్రైనేజ్‌ల లోంచి ప్రవహించే మురికి నీటిని తనలో కలుపుకునే చెరువు.

ప్రతిరోజూలాగే అడుక్కుని, దొరికిన అన్నం, కూరలూ పట్టుకుని తొమ్మిది గంటలు దాటిన తర్వాత వచ్చిన ఇద్దరు. చిరాకు పడుతూ, మనుషుల్ని తిట్టుకుంటూ, నీరసంగా వచ్చిన ఇద్దరు. ఆడా-మగా.

సిమెంట్ బెంచీపై కూర్చుని, అన్నం కూరలూ పంచుకుంటూ వాళ్లిద్దరూ-చలమయ్యా, మరిడమ్మా.

అన్నం, కూరలూ కలుపుకుని తినడానికి అవస్థపడుతూ మరిడమ్మా, చలమయ్యా, కబుర్లు చెప్పుకుంటూ తిండి. విరిగిపోయిన పార్కు పిట్టగోడ సందులోంచి చెరువుగట్టుకు చలమయ్య, టిఫిన్ కారియర్ కడిగి, పొట్టనిండా తాగిన పసరు పట్టిన నీరు. టిఫిన్ కారియర్‌తో మరిడమ్మకు నీళ్ళు. కడుక్కున్న నోరు. తాగిన నీరు.

ఆకులూ, కొమ్మలతో గుబురుగావున్న పనస చెట్టు. మామూలుగా ఇద్దర్నీ ఆహ్వానించిన పనస చెట్టు. ఆ చెట్టుకిందకు వెళ్ళిన మరిడమ్మా, చలమయ్యా.

మాసిన సంచిలోంచి తీసిన దుప్పటి-చిరుగుల దుప్పటి-పచ్చగడ్డి మీద పరచిన దుప్పటి - కుళ్లు కంపుకొడుతూ దుప్పటి - మరిడమ్మా, చలమయ్యలకు ప్రతిబింబమైన దుప్పటి.

చిన్న మూటలోంచి బయటకు తీసిన గుడ్డ పీలికలు-పాత గుడ్డ పీలికలు-తలగడగా అమర్చిన గుడ్డ పీలికలు-వాళ్ళకు తీరే కోరికల్లాంటి గుడ్డ పీలికలు - నెలనెలకీ మరిడమ్మకు తప్పనిసరిగా కావలసిన గుడ్డ పీలికలు-తరచూ వాళ్ళిద్దరకూ అవసరమయ్యే గుడ్డ పీలికలు.

దుప్పటి చివరగా కూర్చున్న చలమయ్య. జేబులోంచి తీసిన మంగుళూరు బీడీ. అగ్గిపెట్టె. మంగుళూరు బీడీ వెలిగించి లాగిన దమ్ము, చలమయ్య తొడపై తలపెట్టుకుని పడుకున్న మరిడమ్మ అతన్ని చూస్తూ, మరిడమ్మ ముంగురులు సవరిస్తూ చలమయ్య.

సినిమా హాలులోంచి బయటకు వస్తున్న మనుషులు. గోల. మిరపకాయల బజ్జీలమ్మే కుర్రాళ్ళ కేకలు. వేరు సెనగకాయలు అమ్మే అవ్వ అరుపులు.

ఆఖరు దమ్ము లాగి. బీడీ విసిరి. లేచి నిలబడ్డ చలమయ్య. ముందే లేచి నిలబడి. చీరకుచ్చీలు సవరించుకుంటూ మరిడమ్మ

సినిమా హాలు వైపు తొందర తొందరగా వేస్తున్న అడుగులు-పళ్ళ బిగపట్టి వేస్తున్న అడుగులు-నేలను తాకడానికి భయపడుతున్న అడుగులు.

"అయ్యా. ధర్మం చెయ్యండి"

"అమ్మా, పైసా ధర్మం చెయ్యండి"

దీనంగా ముఖాలు పెట్టి యాచిస్తున్న చలమయ్యా. మరిడమ్మా, వాళ్ళను చూస్తూనే దూరం దూరంగా పోతున్న మనషులు-చిల్లర లేదంటూ ముఖం పక్కకు పెట్టుకు వెళ్తున్న మనషులు - జాలి భయంతో, భయం

జాలితో వాళ్ళ టిఫిన్ కారియర్లలో పడ్డాయో, లేదో చూడకుండా డబ్బులు విసిరిపోతున్న మనుషులు-వాళ్ళను ఎక్కడ తాక వస్తుందోనని గజగజ వణికి పోతున్న మనుషులు.

"అయ్యా, బాబులూ! ఇంతకు ముందు నేనూ నీలాగే వుండే వాడినయ్యా. ఈ మాయదారి రోగం వచ్చిన తర్వాత ఇలాగయిపోయాను. ఒరేయ్, చారల చొక్కా. మొహం అలా పెట్టేవేట్రా తొత్తు కొడకా, రేపు ఈ జబ్బు నీ కొస్తే ఏం చేస్తావురా సన్నాసీ. ఆ చారల చొక్కాగాడి క్కూడా ఈ జబ్బు వస్తే ఎంత బావుణ్ణును" చలమయ్య మనసులొ కసి, తనను అసహ్యించుకున్న వాడిపై మరింత అసహ్యం.

"అమ్మా, బుల్లెమ్మా! ముఖం ముడుచుకుంటావ్ మే? నీకంటే అందంగా వుండేదాన్నే, ముఖం అదోలా పెట్టి ఉమ్మేస్తావేమే ముండా. నీ క్కూడా యీ జబ్బురాదని నమ్మకమేంటే తల్లీ" మరిడమ్మ మనసులో మంట.

సగం చూసిన సినిమా పూర్తి చెయ్యడానికి హాలులోనికి పోయిన జనం. నెమ్మదిగా వెనక్కు మళ్ళిన చలమయ్యా, మరిడమ్మా పనస చెట్టు కిందకి,

చల్లగా మెల్లగా వీస్తున్న గాలి. గాలికి లయగా తలూపుతున్న పనస చెట్టు, చిక్కగా చీకటి. కొద్దిగా పడుతున్న మంచు. పైన పక్షుల కిచకిచలు-కింద వేడెక్కుతున్న నరాలు-సుఖాన్ని కోరుతున్న అవయవాలు-ఆత్రుత పడుతున్న కోరికలు-కలిసిన శరీరాలు-బాధపడ్డ శరీరాలు. ఆ బాధలో పొందిన సుఖం, వెచ్చని వూపిరి. ఆయాసం, మరిడమ్మలో అసంతృప్తి అలవాటు చేసుకున్న సర్దుబాటు తత్వం. చలమయ్య మగసిరిపై పొగడ్త, అతనిలో తొంగి చూసిన గర్వం.

మరిడమ్మను చూడలేక కళ్లు మూసుకున్న చలమయ్య. చల మయ్యను చూడలేక కళ్లు మూసుకున్న మరిడమ్మ.

వంకర తిరిగిన పెదవులు, చిన్నదయిన ముక్కు, సగం పుళ్లతో చేతులు, మూసుకుపోతున్న చెవులు, మొండి కాళ్లు, వేళ్లు లేని కాళ్లకు కట్టుకున్న గుడ్డ పీలికలు, ముఖంపై కంతులు. రసికారుతున్న కురుపులు.

ఒకరి ఆకారం మరొకరికి అసహ్యంగా, ఒకరి నుంచి ఒకరికి వాసన. తప్పనిసరి అవసరాలు. ముసుగులో వున్న మనుషులు.

తనకు అప్పుడప్పుడూ అన్నం వేసే కటకటాల యింట్లోంచి 'ఆమె' చలమయ్య కళ్లముందు కదులుతూ, ఎర్రని సన్నని శరీరచ్ఛాయ. అందంగా నవ్వే కళ్లు, పల్చని పెదవులు, పొడవైన జడ. వంగి తన టిఫిన్ కారియర్‌లో అన్నం వేసేటప్పుడు పైట తొలగిన ఆమె భంగిమ. జివ్వుమన్న నరాలు, తన జబ్బు నయమై మాయమై పోతే .. మనసును ఆవరించిన మధుర భావాలు.

గులాబీ రంగు మేడలోని 'అతను' తన టిఫిన్ కారియర్‌లో పది పైసలు వేసిన దృశ్యం మరిడమ్మ మనసులో మెదులుతూ, బలమైన శరీరం, నల్లని నునుపైన ఒళ్ళు, వంకీలజుత్తు, నోటిలో సిగరెట్. చిన్ని కళ్లు, మధురోహలతో నిండిన మరిడమ్మ మనసు. గాలిలో తేలుతున్న శరీరం. ముఖాన్ని ముద్దుపెట్టుకున్న సన్నని చిరునవ్వు.

* * *

పెంకిటిల్లు కటకటాల్లోంచి తదేకంగా చూస్తున్న ఆమె. కళ్లు సగం వాల్చి. చేయి వూపుతూ, కొద్దిన జంకిన చలమయ్య. చుట్టూ చూసిన చలమయ్య. జన సంచారం లేని రోడ్డు. దూరమైన భయం.

ధైర్యాన్ని ఎరువు తెచ్చుకుని ముందుకు కదిలిన కాళ్లు-గాలిలో తేలిపోతున్న కాళ్ళు-ఉత్సాహంతో వేగంగా పడుతున్న కాళ్ళు-నల్లగా నున్నగా నిగనిగలాడుతున్న బూట్లు తొడుక్కున్న కాళ్ళు.

తనని ఒకసారి చూసుకున్న కళ్ళు - నవనవలాడే శరీరాన్ని చూసుకుని మురిసిపోయిన కళ్ళు.

నుదుటికి పట్టిన చమటను తుడుచుకున్న చేతులు _ ముందుకూ, వెనక్కూ అందంగా కదులుతున్న చేతులు - దొరకబోయే ఆనందాన్ని అందుకోవాలని తహతహలాడుతున్న చేతులు.

ఊహల ఉయ్యాలలో ఊగుతున్న హృదయం.

తెరుచుకున్న పెంకిటిల్లు కటకటాలు. గాజుల గలగలలు. తడబడుతున్న అడుగులు. చలమయ్య చేతికి తన చేయి కలిపిన ఆమె, కొద్దిగా వణికిన కంఠంతో ఆమె.

చలమయ్య ఎరువు తెచ్చుకున్న ధైర్యం ఆమెకు. ఊరికి దూరంగా వున్న రైల్వే స్టేషన్, కంగారు కంగారుగా రైల్వే స్టేషన్‌కు. కొన్న టిక్కెట్లు. మరో ఊరికి చేర్చిన రైలు, లాడ్జిలో అద్దెకు తీసుకున్న గది.

స్ప్రింగ్ కాట్‌పై వెల్లకిలా పడుకున్న ఆమె_జారిన పైటతో ఆమె-చలమయ్యను తనమీదకు లాక్కున్న ఆమె.

వేడెక్కిన నరాలు - వేడిని చల్లార్చమంటున్న నరాలు - కామాన్ని కాల్చివేయ మంటున్న నరాలు.

సినిమాహాలు ముందు చింపిరి జుట్టుతో, ఏదోపాట పాడుతూ అడుక్కుంటున్న మరిడమ్మ చలమయ్య కళ్ల ముందు వికృతంగా కనిపిస్తూ, జలదరించిన చలమయ్య ఒళ్ళు, మరిడమ్మపై జాలువారిన జాలి, కళ్ళు మూసుకుని 'ఆమె'ను గట్టిగా కౌగలించుకున్న చలమయ్య ...

గులాబీరంగు మేడ దగ్గర కారులోంచి దిగిన మరిడమ్మ, కారు శబ్దానికి ఇవతలకు వచ్చిన అతను-విచిత్రంగా మరిడమ్మను చూస్తూ.

సిమెంట్ కలర్ చీరలో, అదేరంగు బ్లౌజులో షోరూమ్‌లోని బొమ్మలా మిలమిల మెరిసిపోతూ మరిడమ్మ, మిసమిసలాడుతున్న యవ్వనం. నిర్లక్ష్యంగా నిలబడి వయ్యారంగా ఊపుతున్న హేండ్ బాగ్, కాళ్ళకు ఎత్తైన చెప్పుజోళ్ళు, చేతికి రిస్ట్ వాచీ, మెళ్ళో ముత్యాలహారం.

మరిడమ్మ వైపు కైపుగా చూస్తూ వచ్చిన అతను, ఆమె అందాన్ని వర్ణిస్తూ. జాలి గొలిపే చూపులతో ప్రాధేయపడుతూ, వినయంగా వంగి లోపలికి ఆహ్వానిస్తూ. కరుణించిన మరిడమ్మ. దగ్గరగా వచ్చిన అతను, నువ్వే కావాలని బతిమలాడుతూ, నువ్వే నా ప్రాణం అంటూ, రెండు కాళ్ళూ పట్టుకుని, పెళ్ళి చేసుకుందాం అంటూ.

మరిడమ్మ పెదవులపై నాట్యం చేసిన చిర్నవ్వు, తళతళా మెరిసిన పలువరస, అక్కున చేర్చుకోమనే అవయవాల వంపుల సొంపులు, బుగ్గల్లో కెంపులు . క్రీగంట చూసిన చూపుల్లో సిగ్గుల సింగారు.

మరిడమ్మలో నెత్తురు-అతనిలోనూ నెత్తురు-సలసలకాగిన నెత్తురు-వేగంగా పరుగెత్తిన నెత్తురు-మరోనెత్తురు తనలో కలవాలనుకుంటున్న నెత్తురు-ఇంకో నెత్తురులో తను కలవాలనుకుంటున్న నెత్తురు.

చిత్తుగా తీర్చుకున్న కోరికలు

మత్తుగా సోలిన శరీరాలు.

సినిమాహాలు ముందు చేతిలోని గిన్నెను గిలగిలలాడిస్తూ అడుక్కుంటున్న చలమయ్య మరిడమ్మకు రోతకలిగిస్తూ, చలమయ్యపై మరిడమ్మ కురిపించిన సానుభూతి, ముఖం దించుకుని 'అతన్ని' బలంగా కౌగలించుకున్న మరిడమ్మ...

* * *

పాదాలకు కట్టుకున్న గుడ్డ పీలికల్ని కొరికిన ఎలుకలు-ఆహారం దొరికిందన్న ఆనందంతో ఎలుకలు - వాడైన పళ్లను వేళ్లులేని మొండి కాళ్ళల్లోకి దింపుతూ ఎలుకలు - అందిన మాంసాన్ని నాలుకతో నోట్లోకి లాగుకొని పరపరా నములుతూ ఎలుకలు.

స్పర్శజ్ఞానం కోల్పోయిన శరీరాలపై ఏవో గుచ్చుకుంటున్నట్టు ఒక విధమైన భావన, కదిలిన శరీరాలు, కలిపి కదిలిన శరీరాలు, చెదిరిన నిద్ర. తెరిచిన కళ్లు, ఒకరి నొకరు గట్టిగా కౌగలించుకొని పడుకున్న చలమయ్యా, మరిడమ్మా, నాలుగు కాళ్ల వైపుకి దృష్టి సారించిన నాలుగు కళ్లు, మనసుల్ని ఆవరించిన చీకటి.

తనకు కల వచ్చిందని చెప్పిన చలమయ్య, నాకూ కల వచ్చిందని అన్న మరిడమ్మ.

మొదట తన కల గురించి చెప్పిన చలమయ్య. మరిడమ్మకు తగ్గిన కుష్ఠువ్యాధి, చలమయ్యకు నయమైన కుష్టువ్యాధి. ఒక కటకటాల పెంకిటిల్లు

అందులో తమ సంసారం, హాయిగా సాగుతున్న కాపురం. రిక్షాలో సరదాగా సినిమాకు, మొదటి తరగతి టిక్కెట్టుకు.

తర్వాత మరిడమ్మ చెప్పిన కల - నవనవలాడుతున్న శరీరంతో చలమయ్య. మిసమిసలాడుతున్న ఒళ్లుతో మరిడమ్మ. గులాబీ రంగు మేడలో యిద్దరి సంసారం. ఒక అందమైన పాప. చలమయ్య. మరిడమ్మల మధ్య బుల్లి బుల్లి కబుర్లాడుతూ చిన్నారి పాప తనను ముద్దు పెట్టుకోమన్న పాప. ముద్దు పెట్టుకోబోయిన చలమయ్యా, మరిడమ్మా, కిందకు వంగిన పాప. ఒకర్ని ఒకరు ముద్దు పెట్టుకున్న మరిడమ్మా. చలమయ్యా అదేదో సినిమాలోలా.

చలమయ్యపై మరిడమ్మ వెల్లడించుకున్న ప్రేమ. మరిడమ్మపై చలమయ్య తెలుపుకున్న అనురాగం.

నోట్లోనుంచి వస్తున్న మల్లెల మాటలు. హృదయంలో మసిబారిన మూకుళ్ళు.

"మనసులో మాలిన్యం వున్నా మల్లె పూవులా నవ్వడం..."

లేచి కూచున్న ఇద్దరూ.

మరిడమ్మ నడుంపై చలమయ్య మొండిచెయ్యి. చలమయ్య తల నిమురుతూ మరిడమ్మ మొండివేళ్లు.

* * *

ఎప్పటిలాగే పార్కులోని రేడియో నుంచి పాటలు - వినడానికి వస్తులు శ్రోతలు. ఎప్పటిలాగే పసరు పట్టిన నీటితో వున్న చెరువు.

ఎప్పటిలాగే కాస్తున్న వెన్నెల-ఆకాశంలో తళుక్కున మెరుస్తున్న నక్షత్రాలు.

ఎప్పటిలాగే కాళ్ళకు అవసరం వస్తున్న గుడ్డ పీలికలు, ఎప్పటిలాగే శరీరాన్ని అంటి పెట్టుకున్న దురదలు - గోక్కోడానికి కావలసి వస్తున్న పుల్ల ముక్కలు,

ఎప్పటిలాగే కంటున్న రకరకాల అందమైన కలలు_తమ కలల గురించి రంగులు మార్చి చెప్పుకుంటున్న చలమయ్యా, మరిడమ్మా.

ఎప్పటిలాగే కలుస్తున్న శరీరాలు-తీరుతున్న నరాల తీయని బాధ. ఎప్పటిలాగే ఆ సుఖం కోసం అవయవాల రాపిడి.

ఎప్పటిలాగే ఆడుకుంటున్న మరిడమ్మా, చలమయ్యల జంట

(వసుధ మాసపత్రిక, సెప్టెంబర్'71.)